

వెంకటేశ్‌కుమార్‌కు రాష్ట్ర సంగీత విద్వాన్ పురస్కారం

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం 2025 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర సంగీత విద్వాన్ పురస్కారాన్ని హిందూస్తానీ గాయకుడు ఎం వెంకటేశ్‌కుమార్‌ను ఎంపిక చేసినట్లు కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడగి ప్రకటించారు. ఈనెల 22న సోమవారం మైసూరు దసరా ప్రారంభోత్సవంలో వెంకటేశ్‌కుమార్‌కు ముఖ్యమంత్రి పురస్కారాన్ని ప్రదానం చేస్తారన్నారు. 5 లక్షల రూపాయల నగదు, సరస్వతి విగ్రహాన్ని బహూకరిస్తారన్నారు. వైకే ముద్దుకృష్ణ నేతృత్వంలోని కమిటీ ఎంపిక చేసిందని, మైసూరు ప్యాలెస్ వేదికగా ఘనంగా సత్కరిస్తామన్నారు.

దోపిడీ సొమ్ము దొరికింది..!

- కొలిక్కి వస్తున్న చడచణ బ్యాంకు దోపిడీ కేసు
- మహారాష్ట్రలో 6 కేజీల బంగారం, 41లక్షల నగదు గుర్తింపు

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విజయపుర జిల్లా చడచణ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు దోపిడీ కేసులో పోలీసులు విస్తృతంగా గాలింపులు జరుపుతున్నారు. ఈనెల 16న బ్యాంకు దోపిడీ జరిగిన సంగతి తెలిసిందే. అదే రోజునుంచే పోలీసులు 8 బృందాలుగా ఏర్పడి గాలింపు కొనసాగిస్తున్నారు. మహారాష్ట్రలోని సొల్లాపుర జిల్లా మంగళవేడ తాలూకా హులజంతి గ్రామంలో దోపిడీ దొంగలు ప్రయాణిస్తున్న కారు, ఓ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన సంగతి తెలిసిందే. స్థానికులు వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా బ్యాగులతో పరారీ అయ్యారు. ఇలా ఉండగానే హులజంతి గ్రామంలోని ఓ పాడుబడ్డ ఇంటి పైకప్పున బ్యాగును శుక్రవారం గుర్తించారు. స్థానికులు మంగళవేడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అందులో 6.64 కేజీల బంగారంతోపాటు రూ.41 లక్షల నగదు గుర్తించారు. కారును అక్కడే వదిలి మరో కారులో పరారీ అయ్యారు. కారులో లభించిన బంగారం, నగదును స్థానికులు తీసుకెళ్లారు. ఆ తర్వాత దోపిడీకి సంబంధించిన సొమ్ముగా తేలడంతో హలజంతి గ్రామస్థులు 2.50 లక్షల నగదు, కొంత బంగారం ఆభరణాలను పోలీసులకు వాపసు చేశారు. చడచణ బ్యాంకు ఖాతాదారులలో ధైర్యం నింపేందుకు ప్రత్యేక సమావేశం జరిపారు. ఎస్‌బీఐ బ్యాంకు కలబురగి రీజియన్ అధికారులు, ఏఎస్పీ రామనగౌడ హట్టి తదితరులు పాల్గొన్నారు. ఖాతాదారులు, బంగారం తాకట్టు పెట్టినవారు ఆందోళన చెందరాదని సూచించారు.

ముకులప్ప కాదు..!

- హిందువుగా నమ్మించి పెళ్లి చేసుకున్న యూట్యూబర్ ముకుళప్ప
- కూతురిని అప్పగించాలని పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక పరిధిలోని ధారవాడ గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో యూట్యూబర్ ఖ్వాజా శిరహట్టి అలియాస్ ముకుళప్పపై భజరంగ్‌దళ్ కార్యకర్తలతోపాటు అతడి భార్య తల్లిదండ్రులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఖ్వాజా అలియాస్ ముకుళప్ప హిందువుగా నమ్మించి మోసంతో పెళ్లి చేసుకున్నారని గాయత్రి తల్లి శివక్క జాలిహాళ ఒక వీడియో విడుదల చేశారు. యూట్యూబ్ వీడియోలు చేసేందుకు ఖ్వాజాతోపాటు గాయత్రి వెళ్లేవారని, పలు ప్రాంతాలలో వీడియో షూటింగ్‌లకు వెళ్లారన్నారు. హిందువు అంటూ నమ్మించి గాయత్రిని పెళ్లి చేసుకున్నారని ఆరోపించారు. వీడియోల ద్వారా తమ కుమార్తెను చూసుకుని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదుగుతుందని భావించామని, ఖ్వాజా నమ్మించి పెళ్లి చేసుకున్నారన్నారు. తమ కుమార్తెను తమకు అప్పగించాలని గాయత్రి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



పట్టుకుంది బంగారమే

- అభివృద్ధిలో పట్టు పరిశ్రమ
- 26 రాష్ట్రాల్లో సాగు 80 దేశాలకు ఎగుమతి
- సీఎస్‌బీ వార్షికోత్సవంలో ఎంపీ లక్ష్మీనారాయణ

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా పట్టు పరిశ్రమ అభివృద్ధి దిశగా దూసుకు పోతోందని, సాంకేతికతతో సత్ఫలితాలు ఇస్తోందని అనంతపురం ఎంపీ, సెంట్రల్ సిల్క్‌బోర్డు (సీఎస్‌బీ) కమిటీ సభ్యుడు, అనంతపురం ఎంపీ జీ లక్ష్మినారాయణ అభిప్రాయపడ్డారు. జీకేవీకేలోని బాబురాజేంద్రప్రసాద్ ఇంటర్నేషనల్ సెమినార్ హాల్‌లో శనివారం కేంద్ర పట్టుమండలి 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. చిక్కబళ్ళాపుర ఎంపీ డాక్టర్ కే సుధాకర్, కేంద్ర పట్టుమండలి జాయింట్ సెక్రటరీ పద్మిని సింగ్లా ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మినారాయణ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏర్పడిన కేంద్రపట్టుమండలి దేశవ్యాప్తంగా పట్టు సాగుతోపాటు ఆధునాతన విధానాలను తీసుకురావడంలో సత్ఫలితాలను ఇస్తోందన్నారు. ప్రధానమంత్రి వికసిత భారత్ ఆశయానికి అనుగుణంగా పట్టుశాఖ కూడా ప్రగతి సాధించాలని, విదేశాలకు ఎగుమతుల ద్వారా కొత్త రికార్డులు నమోదు చేయాలని ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలలో 129 జిల్లాల్లో పట్టుసాగు చేస్తున్నారన్నారు. రూ.3లక్షలనుంచి ప్రారంభమైన ఎగుమతులు 80దేశాలకు ప్రస్తుతం రూ.2,360 కోట్లుగా ఉందన్నారు. పట్టు రైతులకు ఆంధ్రప్రదేశ్‌లో గతంలో కేజీకి 50 రూపాయల చొప్పున ప్రోత్సాహకం ఇచ్చేవారని, అది దేశవ్యాప్తంగా పునరుద్ధరించాలని ప్రధానమంత్రిని కోరుతామన్నారు. రేరింగ్‌షెడ్‌ల నిర్మాణానికి రూ.10 లక్షల దాకా ఆర్థికసాయం అందించాలని కోరనున్నట్లు తెలిపారు. గోశాలల తరహాలో పట్టుపురుగుల రేరింగ్‌షెడ్‌ల నిర్మాణానికి జాతీయ ఉపాధి పథకాన్ని అనుసంధానం చేయాలని కోరారు. ఎంపీ సుధాకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పట్టు సాగు పెరుగుతోందన్నారు. రేషం అనేది ఒక పంట కాదని, భారతీయ పరంపర సంస్కృతి అన్నారు. కోటిమందిదాకా పట్టు పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారన్నారు. నాల్వడి కృష్ణరాజ ఒడియార్ స్విట్జర్లాండ్ నుంచి తీసుకొచ్చిన ఈ సంస్కృతి ద్వారా మైసూరు పట్టువస్త్రాలు విశ్వవ్యాప్తంగా మహిళలను ఆకట్టుకుంటోందన్నారు. పట్టువస్త్రాలను దేశప్రజలు ధరించే విధానానికి అలవాటు పడాలని తద్వారా పట్టు పరిశ్రమకు సంబంధించి ఆదరణ మరింత పెరుగుతుందన్నారు. సీఎస్‌బీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ నరేశ్‌బాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలలో 2.56లక్షల హెక్టార్లలో మల్బరీ సాగు చేస్తున్నారని, 41,115 మెట్రిక్ టన్నుల పట్టు ఉత్పత్తి జరుగుతోందన్నారు. 12 లక్షలమంది రైతులతోపాటు కోటిమంది ఉపాధి పొందుతున్నారన్నారు. సీఎస్‌బీ మెంబర్ సెక్రటరీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. 122మంది శాస్త్రవేత్తలకు నియామకపత్రాలను అందజేశారు. దేశవ్యాప్తంగా సీఎస్‌బీకి అనుబంధంగా ఉండే 159 యూనిట్లలో వీరు సేవలందించనున్నారు. రాష్ట్రాల వారీగా ఆదర్శరైతులను ప్రశంసాపత్రాలతో గౌరవించారు.



సీఎస్‌బీ వార్షికోత్సవ వేదికపై ఎంపీలు లక్ష్మీనారాయణ, సుధాకర్ తదితరులు

రేపటి నుంచే కులగణన

హుబ్బళ్ళి సమావేశ వేదికపై పంచపీఠాధిపతులు

- మంత్రులు అసంతృప్తితో ఉన్నా సీఎం ముందడుగే
- హోరెత్తుతున్న కులసంఘాల సమావేశాలు
- భారీగా హాజరైన లింగాయతలు, ఒక్కలిగలు
- ఒకే వేదికపై డీకే, కుమారస్వామి
- రేపటి హైకోర్టు తీర్పుపైనే ఉత్కంఠ





బెంగళూరు ఆదిచుంచనగిరి మఠం ఒక్కలిగ సమావేశంలో డీసీఎం డీకే శివకుమార్, కేంద్ర మంత్రి కుమారస్వామి, స్వామీజీలు

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన సర్వేకు ముహూర్తం ఖరారైంది. పదేళ్ల వ్యవధిలో కులగణన సర్వే జరగడం ఇది రెండో సారి. గతంలో జరిగిన సర్వే నివేదికల పట్ల కులసంఘాలు మండిపడడం, మంత్రుల మధ్యే బేధాభిప్రాయాలు రావడంతో అందరినీ ఒకేతాటిపైకి తీసుకురావడం సాధ్యమయ్యేది కాదని భావించిన అధిష్ఠానం సునాయాసంగా దశాబ్దకాలం కిందటి సర్వేను పరిగణించలేమని తేల్చి చెప్పింది. దీంతో వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి లక్షలాదిమంది జరిపిన సర్వే, ఆ తర్వాత బీసీ కమిషన్ ఏళ్ల తరబడి జరిపిన క్రోడీకరణ అంతా గంగపాలైనట్లు అయ్యింది. దీంతో మరోసారి కులగణనకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 22 నుంచి 15 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేపట్టనున్నారు. గత సర్వే నివేదిక బహిరంగమైన తర్వాత మంత్రులతోపాటు కులసంఘాలు వ్యతిరేకించగా ప్రస్తుతం సర్వేకు ముందే వివాదాలు సాగుతున్నాయి. ఓవైపు మరోరోజులోనే సర్వే ప్రారంభం కావాల్సి ఉండగా బ్రాహ్మణ, ఒక్కలిగ సంఘంతోపాటు న్యాయవాదులు వేర్వేరుగా సర్వేను రద్దు చేయాలని హైకోర్టును ఆశ్రయించాయి. సోమవారం నుంచి సర్వే జరగనుండగా అదే రోజున హైకోర్టు విచారణ జరపనుంది. ధర్మాసనం తీర్పు ఏ విధంగా ఉంటుందనేది ఉత్కంఠ రేపుతోంది. రెండురోజులక్రిందట జరిగిన మంత్రివర్గ సమావేశంలో మంత్రులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. పలు హిందూ కులాల ముందు క్రిస్టియన్ పదం చేర్చడాన్ని వ్యతిరేకించారు. మైనారిటీ వర్గాలకు వత్తాసు పలికేలా ఉందని డీసీఎం డీకే శివకుమార్, సీనియర్ మంత్రి ఎంబీ పాటిల్ వంటివారు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయినా మంత్రివర్గ సమావేశం దాదాపు ఐదారు గంటలపాటు కొనసాగింది. అయినా మంత్రుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. చివరకు ఓ ప్రైవేట్ హోటల్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, డీసీఎంతోపాటు పలువురు మంత్రులతో చర్చలు జరిపి సానుకూలం చేశారు. బీసీ కమిషన్ చైర్మన్ మధుసూధన్ నాయకతోపాటు కార్యదర్శులు, సభ్యులు గందరగోళంలో పడ్డారు. వరుసగా ముఖ్యమంత్రి సభలకు ఆహ్వానిస్తుండడం, ఎప్పటికప్పుడు పలు మార్పులు తీసుకొచ్చేలా సూచనలు చేస్తున్నారు. పలు కులాల ముందు ఏర్పాటు చేసిన క్రిస్టియన్ పదాన్ని తొలగించాలని నిర్ణయించారు. చివరకు క్రిస్టియన్లు కూడా మా మతంతోపాటు హిందూమతంలోని కులాలకు అనుబంధంగా చేర్చరాదని అభ్యంతరం తెలిపారు. మంత్రులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కురుబ క్రిస్టియన్, ఒక్కలిగ క్రిస్టియన్, లింగాయత క్రిస్టియన్ వంటి పేర్లను వ్యతిరేకించారు. ఇలా 46 కులాలకు అనుబంధంగా ఉండే క్రిస్టియన్ పదాన్ని తొలగించారు.

ఒక్కలిగగానే నమోదు చేయండి

కులగణన సర్వే విషయంలో ఒక్కలిగ సమాజానికి చెందిన ముఖ్యులంతా శనివారం సమావేశమయ్యారు. ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామీజీ అధ్యక్షత వహించి కులగణనలో ఒక్కలిగగా నమోదు చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని విజయనగర్ ఆదిచుంచనగిరి మఠంలో జరిగిన కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్, కేంద్రమంత్రి కుమారస్వామి, చిక్కబళ్ళాపుర ఎంపీ కే సుధాకర్, మంత్రి ఎంసీ సుధాకర్, మాజీ సీఎం సదానందగౌడ, నిఖిల్, సీటీ రవి పాల్గొన్నారు. రాజకీయాలలో బద్ధశత్రువులుగా ఉన్న కుమారస్వామి, డీకే శివకుమార్‌లు పరస్పరం ఒకే వేదికపై పాల్గొనడంతోపాటు పరస్పరం పలకరించుకున్నారు. నంజావధూత స్వామీజీ, నిశ్చలానందనాథస్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న సమావేశాలు

కులగణన సర్వే జరిపేందుకు ప్రభుత్వం సిద్ధమైన తరుణంలో కులసంఘాల పెద్దలు సభలు, సమావేశాలు జరుపుతున్నారు. ప్రధానంగా వీరశైవలింగాయత, ఒక్కలిగతోపాటు అన్ని కులాలకు అనుబంధంగా ఉండే మఠాల స్వామీజీలు గడిచిన నాలుగైదురోజులుగా కుల బాంధవులను ఒకతాటిపైకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. హుబ్బళ్ళిలో శుక్రవారం వీరశైవలింగాయత ఏకతా సమావేశంలో పంచపీఠాధిపతులతోపాటు హరగురు చరమూర్తులు పాల్గొన్నారు. సిద్ధాంతపరంగా భిన్నాభిప్రాయాలు పక్కనపెట్టి వీరశైవలింగాయత మఠాధిపతులు అందరూ పాల్గొన్నారు. 30శాతం ఉండే లింగాయతుల సంఖ్య తగ్గిందనే అభిప్రాయాలు ఉన్నాయని, వీరశైవలింగాయతలు హిందూమతంగా నమోదు చేసి కులం కాలంలో వీరశైవలింగాయతగానే నమోదు చేయాలని తీర్మానించారు. ప్రస్తుతం కొత్తమతం పేరుతో ముందుకెళ్లి భంగపడకుండా ఉన్న మతాన్ని కాపాడుకోవాల్సి ఉందని బాళెహొన్నూరు మఠాధిపతి రంభాపురి వీరసోమేశ్వర జగద్గురు తెలిపారు. వీరశైవ లింగాయతగానే నమోదు చేయాలని కోరారు. వీరశైవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ బిదరి మాట్లాడుతూ.. గడిచిన రెండున్నర దశాబ్దాలలో అందరి తప్పులతో పాతాళానికి వెళ్లామని, ప్రస్తుతం ఏకతా సమావేశం ద్వారా కలసి ముందుకెళ్తామన్నారు. సమాజానికి జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దుకోవాల్సి ఉందన్నారు. మహాసభ ప్రధాన కార్యదర్శి మంత్రి ఈశ్వర్‌ఖండ్రె మాట్లాడుతూ వీరశైవ లింగాయత వేరు కాదని గతంలో కొనసాగిన వైభవాన్ని కలసికట్టుగా తీసుకెళ్దామన్నారు. పంచపీఠాధిపతులు నిర్వహించిన ఏకతా సమావేశానికి మూరుసావిరమఠ గురుసిద్ధరాజేంద్ర యోగీంద్రస్వామిజీ హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ బసవరాజ్ బొమ్మై మాట్లాడుతూ హిందూ మత పరంపరతో వచ్చామని, మతం పేరును హిందువుగా నమోదు చేసి కులాన్ని వీరశైవలింగాయతగా నమోదు చేద్దామన్నారు. కేఎల్‌ఈ కార్యాధ్యక్షుడు ప్రభాకర్ కోరె మాట్లాడుతూ 110 ఏళ్లకిందటి మహాసభను రక్షించుకుంటే మన మనుగడ సాధ్యమన్నారు.



ప్రసంగిస్తున్న ఎంపీ జగదీశ్ శెట్టర్

దరఖాస్తు సిద్ధం చేసిన బీసీ కమిషన్

కులగణన సర్వేకు అవసరమైన వివరాలు అంతిమం కాలేదని, ప్రస్తుతానికి మార్గదర్శకం కోసం నమూనా దరఖాస్తు మాత్రమే సిద్ధం చేశామన్నారు. ఇంటింటికీ వెళ్లే సిబ్బంది అనుకూలం కోసం ఇంగ్లిష్ అల్ఫాబెటికల్ ప్రకారం జాబితాను రూపొందించారు. చర్చ జరుగుతున్న కులాల పేర్లను ప్రస్తుతం చేర్చలేదు. ఇటువంటి వివాదం గత సర్వేలోనూ కొనసాగింది. అభ్యంతరాలు వచ్చిన పలు కులాల పేర్లు యాప్‌లో కనిపించవన్నారు. అయితే సర్వే జరిపేవారు పేర్లు నమోదు చేసుకునే ప్రజలు సూచించిన కులాన్ని మాత్రమే నమోదు చేస్తారు. వివరాలు సేకరించిన తర్వాత అటువంటి కులాల సందేహాలను నిపుణుల ద్వారా విశ్లేషించి విభజన చేయదలిచినట్లు కమిషన్ తెలిపింది. అయితే ప్రతిపక్షనేత అశోక్, కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియాగాంధీ టాస్క్ ఇచ్చారనే సీఎం సిద్ధరామయ్య కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. ఇక బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర స్పందిస్తూ మతం పేరిట కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని మండిపడ్డారు. కులం ఏదైనా హిందువుగా నమోదు చేయాలని సూచించారు.



పొలాల్లోకి మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్థులు 8

శ్మశానం లేక ఇబ్బందులు

- పొలాల్లో అంత్యక్రియలు చేస్తున్న గ్రామస్థులు

అడవిని ఖుద్రేముఖ్‌కు అప్పగించండి



సండూరు ఫారెస్టులోని దేవదారి బ్లాక్ 8

- దేవదారి అటవీ ప్రాంతాన్ని అప్పగించాలని హైకోర్టు ఆదేశం
- వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఇనుప ఖనిజం తవ్వకాలకు కేఐఏసీఎల్‌కు గ్రీన్ సిగ్నల్
- అనుమతులపై జనసంగ్రామ పరిషత్ ఆవేదన

అలంద వివాదంపై సిట్ ఏర్పాటు

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కలబురగి జిల్లా అలంద నియోజకవర్గంలో 250 పోలింగ్ కేంద్రాల పరిధిలో 6,670 ఓట్లను జాబితానుంచి తొలగింపునకు సంబంధించిన వివాదంపై రాష్ట్రప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్ బీకే సింగ్ ముఖ్యులు కాగా ఐపీఎస్ అధికారులు సైదులు అదావత్, శుభాన్వితలను సభ్యులుగా ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్లక్రితం శాసనసభ ఎన్నికల వేళ 6670 ఓట్లు తొలగించారని అప్పటి మాజీ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ (ప్రస్తుత ఎమ్మెల్యే) ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కమిషన్ పరిశీలనలు జరిపి 6078 ఓట్లను తొలగించాలని ఆన్‌లైన్ అప్లికేషన్‌లు వచ్చినట్టు నిర్ధారించారు. వాటిలో 24 అర్జీలను పరిశీలించి జాబితానుంచి తొలగించారు. అయితే 5,994 పిటీషన్‌లు దురుద్దేశ్యంతో వివిధ మొబైల్ నెంబర్ల ఆధారంగా నమోదు చేసినట్టు కేఏఎస్ అధికారి మమతాకుమారి 2023 ఫిబ్రవరి 21న అలంద పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదుకు అనుగుణంగా సమగ్ర తనిఖీలకోసం ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది.

ప్లాస్టిక్ రహిత నగరంగా అనంత

స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



డివైడర్లపై మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారం, భాగస్వామ్యంతో అనంతపురాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. అనంత నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సూర్యానగర్ రోడ్డులో శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి ఎమ్మెల్యే డివైడర్ల మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరంలో 500 మొక్కల నాటారు. అంతకుముందు నగరంలో పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని అధికారులు, నాయకులు, ప్రజలతో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతినెల మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మహిళలు, ప్రజలు మురుగు కాలవలు, రోడ్లపై చెత్త వేయకుండా ఇంటి వద్దకు వచ్చిన మున్సిపల్ కార్మికులకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఏడాది కాలంలోనే నగరంలో 95శాతం ప్లాస్టిక్‌ను నివారించామని, గత ఆరు నెలలుగా ఏఎంసీ, విజిలెన్స్ అధికారులు నిత్యం దాడులు చేస్తున్నారని తెలిపారు. ప్రజల సహకారంతో దేశంలోనే అనంతను రోల్‌మోడల్‌గా మారు స్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఎస్ఈ రాజశేఖర్, టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, కోనంకి గంగారామ్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు రంగాచారి, పోతుల లక్ష్మీనరసింహులు, పీఎల్ఎన్ మూర్తి, కొండన్న, బొమ్మినేని శివ, కార్పొరేటర్లు బాలాంజినేయులు, బాబా, నాయకులు సింగవరం రవి, రాజారావు, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ కృష్ణకుమార్, సంగా తేజశ్విని, సాకే లక్ష్మీనరసింహ, సుధాకర్ యాదవ్, ఫిరోజ్ అహ్మద్, ఏఎంసీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సుందరీకరణ వేగవంతం చేయండి

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో చిత్రావతి నదీ తీర సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్‌కు ఎమ్యెల్యే పల్లె సింధూరా రెడ్డి సూచించారు. కర్నాటక ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు చిత్రావతి నది పొంగి ప్రవహిస్తోంది. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి నదిని ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలనాటికి అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చిత్రావతి నదీ పరివాహకంలోని ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎనుమలపల్లి చెరువు మరువ వద్ద గంగపూజ నిర్వహించారు.



అనంత బస్టాండు: ఎప్పుడొస్తుందబ్బా.. మనూరి బస్సు

ఇంక పండగే..!

దసరా సెలవుల ప్రకటనతో సొంతూళ్లకు విద్యార్థులు



పిల్లోళ్లు ఎబ్బుడు వస్తారో..?
(బడి బయట తల్లిదండ్రుల నిరీక్షణ)



బైబై.. రేపటి నుంచి బడికి సెలవు



బిరబిర పోవల్ల.. లేకుంటే బస్సు మిస్ అయితాది.



ఇదిగో.. ఈ బ్యాగు ఆ సీట్లో వెయ్యన్నా..

అనంతపురం విద్య, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పండుగకు ముందే విద్యాలయాలు, బస్టాండ్ల వద్ద దసరా సందడి నెలకొంది. విద్యాలయాలకు ఈనెల 22నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో నగరంలో ఉండి చదువుకుంటున్న వివిధ ప్రాంతాల విద్యార్థులు శనివారం నుంచే ఇంటిబాట పట్టారు. ఈ క్రమంలో సాయంత్రం విద్యాలయాలు, హాస్టళ్ల వద్ద స్నేహితులకు బైబై అంటూ వీడ్కోలు పలికి, హడావుడిగా బ్యాగులు సర్దుకుని తమ కోసం వచ్చిన వారితో కలిసి ఆనందంగా బస్టాండుకు బయల్దేరారు. పిల్లలను తీసుకెళ్లడానికి వచ్చిన తల్లిదండ్రులతో నగరంలోని పలు ప్రాంతాలు సందడిగా మారాయి. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ జాం అయ్యింది. ఆర్టీసీ బస్టాండ్ పిల్లలు, వారి తల్లిదండ్రులతో కిటకిటలాడింది. బస్సులలో సీట్లకోసం చాలామంది ఫీట్లు చేస్తూ కనిపించారు.



రేయ్.. పొయ్యొస్తాం రా



లే.. లే.. జాగ్రత్తరా..! జారేవు..

డీఐజీ, జిల్లా న్యాయాధికారిని
కలిసిన ఎస్పీ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిముషిని, జిల్లా న్యాయాధికారి భీమారావును నూతన ఎస్పీ సతీష్ కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలను అందజేశారు.





డీఐజీ షిముషికి, జిల్లా న్యాయాధికారి భీమారావుకు పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

పోటీలతో నైపుణ్యం మెరుగు

● జిల్లా విద్యాధికారి కిష్టప్ప



ప్రతిభ చాటిన విద్యార్థులతో జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్

కొత్తచెరువు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లో పాల్గొనడం ద్వారా నైపుణ్యాలు మెరుగు పరచుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప సూచించారు. జిల్లాలోని 12 పాఠశాలల నుంచి 22 మంది విద్యార్థుల బృందాలకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలను శనివారం ఆయా పాఠశాలల్లో నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో అగళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హర్షియాబాను, దీక్షిత, సంజన మొదటి స్థానంలో నిలిచారని జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ తెలిపారు. ముదిరెడ్డిపల్లి, సోమందేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. వ్యాసరచన పోటీల్లో కోరేవాండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వనజ, బిందుశ్రీ, హర్షిత్‌కుమార్ విజేతలుగా అవతరించారు. నిడిమామిడి జిల్లా పరిషత్, ధర్మవరంలోని శాంతి నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేత బృందాలు అగళి, కోరేవాండ్లపల్లికి చెందిన విద్యార్థులు అక్టోబరు 16 నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆ విద్యార్థులను డీఈఓ, సైన్స్ అధికారి, గైడ్ టీచర్‌లు షబ్బీర్, భాస్కర్, మస్తాన్ అభినందించారు.

సూక్ష్మ సేద్యానికి చేయూత

● జీఎస్టీ 5 శాతానికి తగ్గింపు



డ్రిప్ ఇరిగేషన్ యూనిట్

కొత్తచెరువు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందని ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ శనివారం తెలిపారు. సూక్ష్మసేద్యం పరికరాలపై ఇదివరకు జీఎస్టీ 12.5 శాతం వసూలు చేసేవారు. ఇది రైతులకు భారంగా ఉండేది. క్షేత్రస్థాయిలో కూడా డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలకు సబ్సిడీ చెల్లించేందుకు ఇబ్బందులు పడేవారు. దీంతో డ్రిప్, స్ప్రింక్లర్ల పంటలసాగు తగ్గుముఖం పడుతుండటంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని 5 శాతానికి తగ్గించిందని ఆయన తెలిపారు.

భారం తగ్గిందిలా..

గతంలో హెక్టారుకు రాయితీ బిందుం సేద్యపరికరాలకు జీఎస్టీ 12.5 శాతం రైతులు చెల్లించాల్సి ఉండేది. దీంతో రైతు జీఎస్టీతో కలిపి హెక్టారుకు రూ.24వేల నుంచి రూ.28వేలు చెల్లించేవారు. కేంద్రప్రభుత్వం జీఎస్టీని 5 శాతానికి తగ్గించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 2.5 శాతం జీఎస్టీని చెల్లించగా.. మిగిలిన 2.5 శాతం రైతు కట్టుకోవాలి. ఈ లెక్కన రైతు హెక్టారుకు జీఎస్టీ కింద రూ.12వేలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. దీంతో రైతులపై జీఎస్టీ భారం తగ్గింది.

రక్త నమూనాలను ప్రభుత్వ ఆస్పత్రికి పంపాలి

ప్రైవేటు ఆస్పత్రులకు డీఎంహెచ్ఓ సూచన

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): డెంగీ నిర్ధారణ కోసం సేకరించిన రక్త నమూనాలను ప్రభుత్వ ఆసుపత్రి మైక్రో బయాలజీ ల్యాబ్‌కు పంపాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు సూచించారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు అధ్యక్షతన మలేరియా సబ్ యూనిట్ అధికారుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జ్వరంతో వచ్చే రోగుల నుంచి సీరం శాంపిల్స్‌ను సేకరించి, డెంగీ నిర్ధారణ కోసం ఎలిసా పద్ధతిలో పరీక్షలు చేయాలని డీఎంహెచ్ఓ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎలిసా పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అన్ని ల్యాబ్‌ల టెక్నీషియన్స్‌తో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, సబ్ యూనిట్ అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏఓ గిరిజ మనోహర్‌రావు, డాక్టర్లు యుగంధర్, విష్ణుమూర్తి, నరేంద్రరెడ్డి, ఎస్ఓ మహ్మద్ రఫీ, హెచ్ఈఈఓ నాగరాజు, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

● నమో యువ రన్‌లో బీజేపీ నేతలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బంగారు భవితను సర్వనాశనం చేస్తున్న మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవాపక్షోత్సవాల్లో భాగంగా శనివారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నమో యువరన్ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి సప్తగిరి సర్కిల్ ప్రదర్శన నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్, మద్యపానానికి దూరంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి యువతకు సూచించారు. వైసీపీ హయాంలో దేశంలో ఎక్కడ మాదకద్రవ్యాలు పట్టుబడినా మూలాలు ఏపీలో ఉండేవని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, కార్యదర్శి నందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు చిరంజీవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీకి హాజరైన బీజేపీ నాయకులు, యువత

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం: కలెక్టర్ ఆనంద్



మహిళలకు మొక్కలు అందజేస్తున్న కలెక్టర్

గార్లదిన్నె, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు పాటుపడాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టర్ ఆనంద్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహర్ గార్లదిన్నెలో పర్యటించారు. జంబులదిన్నె గ్రామ సమీపంలో రైతు గిర్రెడ్డి సాగుచేసిన మామిడి తోటను, నీటి కుంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. మండలవ్యాప్తంగా పండ్లతోటలు సాగు చేస్తున్నామనీ, తెగుళ్లకు మందులు పిచికారీ చేసేందుకు రాయితీతో డ్రోన్లు ఇవ్వాలని రైతులు కోరారు. అనంతపురం మార్కెట్‌లో చీనీ విక్రయాల్లో రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని రైతులు వాపోయారు. మార్కెట్ నిర్వాహకులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులకు నష్టం వచ్చేలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... రైతు సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందని చర్చించారు. పండ్లతోటలను రైతులు విరివిగా సాగు చేయాలన్నారు. ఉద్యాన పంటలతోనే రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. బస్టాండ్ సర్కిల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఏర్పాటు చేసిన మానవహారంలో పాల్గొని, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం శివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మహిళలకు మొక్కలు అందజేశారు. స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, డ్వామా పీడీ సలీం బాషా, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ డైరెక్టర్ భవానీప్రసాద్, జడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజనాయుడు, డీసీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణా, గేటు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్ కార్డులను ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వండి: జేసీ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్ కార్డులను ఇళ్ల వద్దకే వెళ్లి కార్డుదారులకు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. చౌక ధరల దుకాణాల వద్ద పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయని ఆయన తెలిపారు. సచివాలయ సిబ్బంది నేరుగా ఇళ్లకు వెళ్లి ఇవ్వాలని సూచించారు. జిల్లాలో 6,57,828 స్మార్ట్ రైస్ కార్డుదారులకు ఈ నెల 15 నుంచి పంపిణీ చేస్తున్నామని జేసీ తెలిపారు. ఇప్పటివరకు 3,34,214 మందికి పంపిణీ చేశామని అన్నారు. క్యూ ఆర్ కోడ్ కలిగిన ఈ స్మార్ట్ రైస్ కార్డులను చౌకధరల దుకాణాలకు మ్యాపింగ్ చేసి.. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దకే పంపుతామని తెలిపారు. పంపిణీ సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే, వాటిని పరిష్కరించి కార్డుదారుల ఇంటి వద్దే పంపిణీ చేయాలని సూచించారు. కార్డుదారులను ఒకచోటకు పిలపించి ఇవ్వవద్దని హెచ్చరించారు. తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, సీఎస్‌డీటీలు సచివాలయ సిబ్బంది ద్వారా కార్డుదారుల బయోమెట్రిక్ తీసుకుని, ఇంటి వద్దనే పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



పుట్టపర్తి మండలం చెర్లోపల్లి వద్ద పాక్షికంగా పూడ్చేసిన ఫాంపాండ్

● లోపించిన పర్యవేక్షణ

ఫాంపాండ్లను పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ప్రతి ఫాంపాండ్ స్థలాన్ని జియోట్యాగ్‌చేసి సీజన్ తర్వాత డోన్ సర్వేతో నీటినిల్వ ఉందో లేదా చూడాలి. వర్షాకాలం తర్వాత నిజంగా ఫాంపాండ్‌లో నీరు నిల్వ ఉందని నిర్ధారించిన తర్వాతనే సబ్సిడీ చెల్లించాలి. నకిలీ బిల్లులు వేస్తే భూ అభివృద్ధి చట్టాల కింద కేసులు నమోదు చేయాలి. కాని భూమి దాహం తీర్చి రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతో రూపొందించిన పథకాన్ని సంబంధిత అధికారులు అపహాస్యం చేస్తున్నారనే విమర్శలు మూటగట్టుకుంటున్నారు.

నిధులు తవ్వుకుని..

ఫాంపాండ్లను పూడుస్తున్న కొందరు

ప్రభుత్వ ఆశయానికి తూట్లు

పట్టించుకోని అధికారులు



చెర్లోపల్లి సమీపంలో ఫాంపాండ్‌ను రాళ్లతో నింపిన దృశ్యం

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నిధుల కోసమో, లేక అవకాశం వచ్చింది కదా అని ఫాంపాండ్ తవ్వారు. బిల్లులు చేతికందగానే అవసరం తీరింది కదా అని వాటిని పూడ్చేస్తున్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంచడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫాంపాండ్ల తవ్వకాన్ని ప్రోత్సహించాయి. ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయనే ఆలోచనతో అప్పట్లో చాలా మంది రైతులు ఫాంపాండ్లను తవ్వించారు. ఇదే అదనుగా అప్పటి అధికారపార్టీ నాయకులు అధికారులతో కుమ్మక్కై ఎక్కడబడితే అక్కడ తవ్వకుని బిల్లులు చేసుకుతిన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఆ ఫాంపాండ్లతో పని లేదనుకున్నారో ఏమో కొందరు వాటిని పూడ్చే పనిలో నిమగ్నమయ్యారు. ఇదీ... ప్రభుత్వం ఎంతో సమున్నత లక్ష్యంతో ప్రారంభించిన ఫాంపాండ్ల కథా కమామిషు. మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కనే మూడేళ్ల కిందట ఫాం పాండ్లను తవ్వారు. అదీ వందమీటర్ల పరిధిలో ఒకే వ్యక్తికి చెందిన పొలంలో ఆయన కుటుంబసభ్యుల పేర్లతో మూడు ఫారంపాండ్లకు అనుమతులు తెచ్చుకుని, తవ్వించుకున్నాడు. పీఎంకేఎస్‌వై నిధులతో ఒక్కో ఫాంపాండ్ 50మీటర్ల పొడవు, 20మీటర్ల వెడల్పు 2మీటర్ల లోతుతో తవ్వారు. అప్పటి అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో అధికారులు కూడా ఒక్కో ఫాంపాండ్‌కు రూ.లక్ష బిల్లులు త్వరగానే మంజూరు చేసినట్లు తెలిసింది. ఇక ఇప్పుడు కాలం గడిచిందని ఆ వ్యక్తి ఫాంపాండ్లను పూడ్చేపనిలో నిమగ్నమయ్యారు.

షోకాజ్ నోటీస్ ఇస్తాం



భూగర్భ జలాలను పెంచి తద్వారా రైతుకు లాభం చేకూర్చాలన్న లక్ష్యంతో నిర్మించిన ఫాంపాండ్‌లను పూడ్చిన రైతులకు షోకాజ్ నోటీసులను జారీ చేస్తాం. ఫాంపాండ్ తవ్వకానికి మంజూరు చేసిన నిధులను రికవరీ చేస్తాం.

- విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

గురజాడ అప్పారావు (జయంతి)



దేశంలో గొప్ప సంఘ సంస్కర్త, ప్రముఖ రచయిత గురజాడ అప్పారావు 1862 సెప్టెంబరు 21 విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి తాలూకా ఎస్ రాయవరం గ్రామంలో జన్మించారు. రచనల ద్వారా సమాజంలో మార్పుకు ప్రయత్నించిన మహాకవి. హేతువాది. తెలుగు సాహిత్యంలో వాడుకభాష ఒరవడికి కృషి చేసి కవిశేఖర బిరుదు పొందారు. 19వ, 20వ శతాబ్దం మొదటి దశకంలో ఆయన చేసిన రచనలు నేటికీ మన్నన పొందుతున్నాయి. 'కన్యాశుల్కం' నాటకంలోని గిరీశం, మధురవాణి, రామప్ప పంతులు తదితర పాత్రలు పేరొందాయి. కన్నడ, ఫ్రెంచ్, రష్యన్, ఇంగ్లీషు, తమిళ, హిందీభాషలలోకి అనువాదమైంది. అభ్యుదయ కవితా పితామహగా పేరొందారు. 1915 నవంబరు 30న కన్నుమూశారు.

అద్దంకి శ్రీరామమూర్తి (జయంతి)



సుప్రసిద్ధ తెలుగు రంగస్థల, సినిమా నటుడు, సంగీత విశారదుడు అద్దంకి శ్రీరామమూర్తి 1898 సెప్టెంబరు 21న గుంటూరు జిల్లా కల్యకుర్తిలో జన్మించారు. సంగీత విద్వాన్‌గా అనేక పాటకచేరీలు నిర్వహించారు. ఈయన పాడిన పద్యాలు, కృతులు, శ్లోకాలు గ్రామ్‌ఫోన్ రికార్డులుగా ఇవ్వబడి ప్రచారం పొందాయి. తొలి సినిమా 'హరిశ్చంద్ర'లో అదేపాత్రలో నటించి మంచి పేరొందారు. ధర్మరాజు, దశరథుడి పాత్రలు ఎంతో గుర్తింపు పొందాయి. 25చిత్రాలలో నటించి అసమాన నటుడిగా పేరొందారు. 1968లో కన్నుమూశారు.

ప్రపంచం సీతారాం (జయంతి)



కర్ణాటక సంగీతంలో ప్రఖ్యాత వేణుగాన విద్వాంసుడిగా పేరొందిన ప్రొఫెసర్ ప్రపంచం సీతారాం 1942 సెప్టెంబరు 21న విజయవాడలో జన్మించారు. ఆలిండియా రేడియోలో టాప్ ఆర్టిస్ట్‌గా రాణించారు. సంగీతంలో డాక్టరేట్ పొందారు. కలైమామణి, సంగీత నాటక అకాడమీ అవార్డు, సంగీత కళా శిఖామణి తదితర పురస్కారాలు అందుకున్నారు. 2014 జూన్ 1న కన్నుమూశారు.

అభినవ విద్యాతీర్థ స్వామి (వర్ధంతి)



శృంగేరీ శారదాపీఠం 35వ జగద్గురు అభినవ విద్యాతీర్థ మహాస్వామి 1917 నవంబరు 13న బెంగళూరులో జన్మించారు. పూర్వాశ్రమంలోని పేరు శ్రీనివాస శాస్త్రి. 14వ ఏటనే సన్యాసం స్వీకరించారు. చంద్రశేఖర భారతి మూడవ మహాస్వామి ఆయనను శృంగేరీ పీఠం 35వ జగద్గురుగా నియమించారు. శృంగేరిలో తుంగా నది ఒడ్డున బ్రిడ్జ్ కట్టేందుకు, శృంగేరిలో మౌలిక సదుపాయాలు పెరిగేందుకు చొరవ చూపారు. వేదంతోపాటు యోగాలోనూ నిపుణులు. ఆయన పేరిట స్కాలర్‌షిప్‌లు ఏర్పాటు చేశారు. 1989 సెప్టెంబరు 21న మహాసమాధి అయ్యారు.

సింగీతం శ్రీనివాసరావు (పుట్టినరోజు)



సినీ రంగంలో తనదైన ప్రత్యేకత చాటుకున్న సింగీతం శ్రీనివాసరావు 1931 సెప్టెంబరు 21న నెల్లూరు జిల్లా ఉదయగిరిలో జన్మించారు. దర్శకుడిగా, నిర్మాతగా, స్క్రీన్‌రైటర్‌గా, కంపోజర్‌గా, గాయకుడిగా, స్వరకర్తగా, నటుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. తొలి మూకీ సినిమా 'పుష్పక విమాన'కు సహ నిర్మాతయే కాక స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించారు. తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ, హిందీ సినిమాలకు పనిచేశారు. రెండు జాతీయ, 7 రాష్ట్ర నంది పురస్కారాలు, 3 కర్ణాటక రాష్ట్ర ఫిల్మ్ అవార్డులు అందుకున్నారు.

కరీనా కపూర్ (పుట్టినరోజు)



బాలీవుడ్‌కు చెందిన నటీమణి కరీనా కపూర్ 1980 సెప్టెంబరు 21న జన్మించారు. రాజ్‌కపూర్ మనుమరాలు. అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటీమణులలో ఒకరు. 6 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. డిజైనర్‌గాను రాణించారు. యునిసెఫ్‌తో కలసి బాలికా విద్యకు ప్రోత్సహిస్తున్నారు. సొంతంగా వస్త్రాలు, కాస్మొటిక్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. నటుడు సైఫ్ అలీఖాన్‌ను పెళ్లాడారు. విద్య, మహిళా భద్రతకోసం తనవంతు కృషి చేస్తున్నారు.

దీపికా పళ్లికాల్ (పుట్టినరోజు)



ప్రముఖ స్క్వాష్ క్రీడాకారిణి దీపికా పళ్లికాల్ కార్తీక్ 1991 సెప్టెంబరు 21న కేరళ రాష్ట్రం కొట్టాయంలో జన్మించారు. పీఎస్ఏ ఉమెన్స్ ర్యాంకింగ్‌లో టాప్ 10లో నిలిచిన తొలి భారతీయ యువతిగా గుర్తింపు పొందారు. పద్మశ్రీ, అర్జున అవార్డులు అందుకున్నారు. 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం, 2016 సౌత్ ఏసియన్ గేమ్స్‌లోనూ బంగారు పతకం సాధించారు. ప్రముఖ క్రికెటర్ దినేశ్ కార్తీక్‌ను వివాహం చేసుకున్నారు. 2022 గ్లాస్గో డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీల్లో దేశం నుంచి ప్రాతినిధ్యం వహించారు.

అత్తిబెలెలో అధికారుల పరిశీలన

దొమ్మసంద్ర, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకాలోని అత్తిబెలె ప్రాంతం తమిళనాడుకు సరిహద్దులో ఉంది. ఇక్కడ దసరా నుంచి దీపావళి వరకు బాణాసంచా విక్రయాలు జోరుగా ఉంటాయి. మూడేళ్లక్రితం బాణాసంచా ప్రమాదం నేపథ్యంలో ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించింది. రెవెన్యూ శాఖ అత్తిబెలె ఉపతహసీల్దార్ నవీన్‌కుమార్ నేతృత్వంలో శనివారం పరిశీలనలు జరిపారు. ఆర్ఐ అంజినప్ప, అరుణ్‌కుమార్, అగ్నిమాపక, పురసభ సిబ్బంది పాల్గొన్నారు. భారీ శబ్దాలు వచ్చే బాణాసంచా విక్రయించవద్దని సూచించారు. ప్రభుత్వం విధించిన నియమ నిబంధనలు పాటించి సహకరించాలని దుకాణదారులకు సూచించారు. ఇక్కడి దుకాణాలు, గోడౌన్‌ల స్థితిగతులపై ఈనెల 28న ప్రభుత్వానికి, హైకోర్టుకు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఆనేకల్ తాలూకా ఆరోగ్యాధికారి రవి, అత్తిబెలె డాక్టర్ శుభ, అత్తిబెలె పోలీసులు, అగ్నిమాపక, రెవెన్యూ, కాలుష్యనియంత్రణ శాఖ తదితర అధికారులు పాల్గొన్నారు.



రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులు

కులగణనలో మాతృభాష తెలుగుగా నమోదు చేయండి



విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న సమితి పదాధికారులు

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వేలో మాతృభాష తెలుగుగా నమోదు చేయాలని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు రాధాకృష్ణరాజు పిలుపునిచ్చారు. శనివారం యలహంక ఓల్డ్‌టౌన్‌లోని నీలకంఠేశ్వర ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు యూనిఫాంను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష కాలంలో తెలుగుగా నమోదు చేయకుంటే భాష అంతరించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో 1.20 కోట్లమంది తెలుగు ప్రజలు నివసిస్తున్నారని, వారంతా మాతృభాషను తెలుగుగా నమోదు చేస్తే అమ్మభాష బతుకుతుందన్నారు. తెలుగు మీడియం పాఠశాలలు మూతపడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగువారిపై ఉందన్నారు. శివాజీనగర్ ఓపీహెచ్ రోడ్డులోని తెలుగు స్కూల్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేశామన్నారు. శివాజీనగర్ బస్టాండ్ వద్ద ఉండే తెలుగుస్కూల్ భవనం పాడైనందున ఓపీహెచ్ రోడ్డులోకి మార్పు చేసేందుకు ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులతో చర్చిస్తున్నామన్నారు. తెలుగు విద్యార్థుల ఆధార్ కార్డులు, తెలుగు రాష్ట్రాలలో ఉన్నందున వారికి బస్‌పాసుల సమస్య తలెత్తిందన్నారు. తెలుగు విజ్ఞాన సమితి ఉపాధ్యక్షులు గంగరాజు, ఆదికేశవులు నాయుడు, కోశాధికారి వరదరాజు, బెంగళూరు సౌత్ కమ్మవారి సేవాసంఘం అధ్యక్షుడు వరదరాజులునాయుడు, యలహంక తొగటవీరక్షత్రియసంఘం అధ్యక్షుడు రాజా, పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షుడు సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి వై వెంకటనారాయణ, హెడ్మాస్టర్ రెడ్డిరాణిలు పాల్గొన్నారు.

వీల్‌చెయిర్ టెన్నిస్‌లో రాణించిన శిల్పా పుత్తురాజ్

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ ర్యాంకింగ్ వీల్‌చెయిర్ టెన్నిస్ పోటీలలో మహిళల సింగిల్స్ విభాగంలో శిల్పా పుత్తురాజ్ రాణించారు. నగరంలో జరిగిన పోటీలకు 50మందికిపైగా క్రీడాకారులు భాగ స్వామ్యులయ్యారు. మెన్స్ సింగిల్స్‌లో శేఖర్ వీరస్వామి విజేతగా నిలవగా, మెన్స్ డబుల్స్‌లో బాలచందర్ సుబ్రమణియన్, కార్తీక్ కరుణాకరన్‌లు విజేతలయ్యారు. మహిళల డబుల్స్‌లో శిల్పా పుత్తురాజ్, శిల్ప కుడ్లప్ప గెలుపొందారు. విజేతలకు పద్మశ్రీ గ్రహీత ఎంకే శ్రీధర్ బహుమతులు ప్రదానం చేశారు. అఖిల భారత టెన్నిస్ అసోసియేషన్‌లో అధికారికంగా గుర్తింపు పొందిన పోటీలకు 50మంది క్రీడాకారులు భాగస్వామ్యులయ్యారు. కర్ణాటక అసోసియేషన్ డైరెక్టర్ చంద్రకాంత్ పర్యవేక్షణలో పోటీలు సాగాయి. ఇన్‌ఫ్రా అసోసియేట్స్, కార్ల్, బాల్డోటా బ్రదర్స్, క్రియేటివ్ జియోమెట్రి సంస్థలు సహకారం అందించాయి. అతిథులుగా సీతారాం తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న పద్మశ్రీ డాక్టర్ ఎంకే శ్రీధర్

భవిష్యత్తులో హైడ్రోజన్ ఇంధనం పాత్ర అపారం

» ఇస్రో చైర్మన్ నారాయణన్

దొమ్మసంద్ర, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దేశ బాహ్యకాశ మిషన్‌లు, రవాణా, శుద్ధ ఇంధనం వంటి అంశాలలో హైడ్రోజన్ ప్రత్యామ్నాయ పాత్ర పోషిస్తుందని ఇస్రో అధ్యక్షుడు డాక్టర్ వీ నారాయణన్ అభిప్రాయపడ్డారు. అలయెన్స్ యూనివర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) సంయుక్తంగా 'హైడ్రోజన్ ఇంధన సాంకేతికత - భవిష్యత్తు' అనే అంశంపై రెండు రోజుల సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.



ప్రసంగిస్తున్న ఇస్రో చైర్మన్ నారాయణన్

రానున్న రోజుల్లో సాధారణ గ్యాస్ ఇంధనానికి మరింత డిమాండ్ దృష్ట్యా హైడ్రోజన్ ఇంధనంపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ కలైసెల్వి, నీతి ఆయోగ్ గౌరవ సభ్యులు డాక్టర్ విజయకుమార్ సరస్వత్ ముఖ్యులుగా పాల్గొన్నారు. లిక్విడ్ హైడ్రోజన్, లిక్విడ్ ఆక్సిజన్‌తో క్రయోజనిక్ ఇంజన్ల నిర్వహణపై మరిన్ని పరిశోధనలు జరుగుతున్నా యన్నారు. రానున్న రోజుల్లో హైడ్రోజన్ ఇంధనంతో బస్సులు, రైళ్లు, విమానాలు నడిపే అవకాశం ఉందన్నారు. ఇటీవలి జూన్‌లో ఐదు హైడ్రోజన్ బస్సులు వాణిజ్యసేవల విభాగంలోకి ప్రవేశించాయన్నారు. బీహెచ్ఈఎల్, ఎన్‌టీపీసీలు హైడ్రోజన్ గ్యాస్ టర్బైన్ ఇంజన్ వ్యవస్థలపై ప్రయోగాలు చేస్తున్నాయన్నారు. సదస్సులో 150మందికిపైగా నిపుణులు పాల్గొన్నారు.

గదగ్‌లో ఘోర ప్రమాదం

» ఇద్దరు పోలీసులు సహా మరో వ్యక్తి మృతి

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గదగ్ జిల్లా హర్లాపుర గ్రామం వద్ద 67వ నెంబరు జాతీయరహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పోలీసులు సహా ముగ్గురు దుర్మరణం చెందారు. కొప్పళ నుంచి గదగ్‌వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొని అవతలివైపు నుంచి ఎదురుగా వస్తున్న గోవా రాష్ట్ర ఆర్టీసీ బస్సును ఢీ కొంది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. హావేరి జిల్లా వైర్‌లెస్ విభాగంలో పనిచేస్తున్న అర్జున నెల్లూర (29), కొప్పళ జిల్లా పోలీసుశాఖలో వైర్‌లెస్ విభాగంలో పనిచేస్తున్న వీరేశ్ ఉప్పార (31)తోపాటు అర్జున్ నెల్లూర బంధువు రవి నెల్లూర (43) దుర్మరణం చెందారు. రవి నెల్లూర హావేరి జిల్లా హాణగుంద గ్రామానికి చెందినవారు. గోవా ఆర్టీసీ బస్సు కండక్టర్ హిరేశ్ హిరేమఠ తెలిపిన మేరకు కారు అత్యంత వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీ కొని ఎదురుగా ఇవతలివైపు వస్తున్న మా బస్సును ఢీ కొందన్నారు. ప్రమాదంలో బస్సు డ్రైవర్ గాయపడ్డారన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారులో చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీశారు. కారు వేగంగా వస్తుండడమే ప్రమాదానికి కారణమని గదగ్ రూరల్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని మరింత దర్యాప్తు సాగుతోందని వివరించారు.

ఉచిత వైద్యశిబిరం

మహదేవపుర, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏటా ఆసుపత్రి సామాజిక సేవలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని శ్రీలక్ష్మి గ్రూప్ ఆసుపత్రి సీఈఓ రాఘవేంద్ర సుంట్రళ్ళి తెలిపారు. కేఆర్‌పురలో ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం భారీ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేఆర్‌పుర, దేవసంద్ర, టీసీపాళ్య తదితర ప్రాంతాల వాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నరాల బలహీనత, కిడ్నీ, గుండె, క్యాన్సర్, షుగర్, బీపీతోపాటు పలు రకాల వాటికి ఉచితంగా పరీక్షలు చేశారు. ఆసుపత్రి ముఖ్యులు డాక్టర్ సాంబశివ మాట్లాడుతూ మూడు నెలలపాటు ఈసీజీ, ఎక్స్‌రే వంటివాటికి 50శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి చెందిన జయమాలా తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బెళగావిలో టీటీడీ ఆలయం

» బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బెళగావిలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి అనుబంధంగా వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మిస్తామని టీటీడీ బోర్డు సభ్యుడు ఎస్ నరేశ్‌కుమార్ తెలిపారు. శనివారం వయ్యాలికావల్‌లోని టీటీడీ ఆలయంలో స్థానిక సూపరింటెండెంట్ జయంతితో కలసి మీడియాతో మాట్లాడారు. ఉత్తర కర్ణాటక, గోవా, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన భక్తులకు అనుకూలంగా బెళగావిలో ఆలయం నిర్మిస్తామన్నారు. ఇటీవల జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ అంశంపై విస్తృత చర్చ జరిగిందన్నారు. బెంగళూరుతోపాటు ఇతర మహానగరాలలో ఉన్నట్టే టీటీడీ ఆలయం నిర్మిస్తామన్నారు. తిరుమలలో ఈనెల 22నుంచి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. తిరుమల కల్యాణకట్టలో అదనంగా 1500మందిని నియమించామన్నారు. సూపరిటెండెంట్ జయంతి మాట్లాడుతూ పదిరోజులపాటు వయ్యాలికావల్ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు ఉత్సవాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



వివరాలు వెల్లడిస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్, సూపరింటెండెంట్ జయంతి

నేడు సామూహిక తర్పణం

చేళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్యను పురస్కరించుకుని తాలూకా కేంద్రమైన చేళూరులోని బ్రాహ్మణసంఘం భవనంలో ఆదివారం సామూహిక తర్పణం, పిండప్రదానం చేసే అవకాశం కల్పిస్తున్నారు. బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు సామూహిక తర్పణం చేసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. పూర్వీకులు, పితృదేవతలకు తృప్తి కలిగించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమం అనంతరం భోజన వ్యవస్థ ఉంటుందన్నారు.

లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు





శనైశ్చర, లక్ష్మీవెంకటేశ్వరస్వామి

శిడ్లఘట్ట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవి రోడ్డులో కొలువైన లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేషపూజలు నిర్వహించారు. స్వామివారికి మహాభిషేకం, అలంకరణ, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా పట్టణంలోని శనిమహాత్మస్వామి ఆలయంలోనూ విశేషపూజలు కొనసాగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

సోమందేపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పెద్దన్న పిలుపునిచ్చారు. శనివారం తుంగోడు పంచాయతీలో ప్రభుత్వం చేపడుతున్న బలవంతపు భూసేకరణను ఆపాలని 24న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో బాధిత రైతు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు సురేష్, రత్నమ్మ, రామాంజనేయులు, అంజినప్ప, బాబు, ఓబులేసు, గంగప్ప, కిష్టప్ప పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేతివృత్తుల ప్రదర్శన

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దసరా నేపథ్యంలో రాజస్థాన్ చేతివృత్తులు, కళాఖండాల ప్రదర్శన హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని ఆకట్టుకుంటోంది. సిద్ధార్థ కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 29వరకు ప్రదర్శన కొనసాగనుంది. గృహాలంకరణ వస్తువులు, కుర్చీలు, పాదరక్షలు, చీరలు ఇలా పలు రకాలు ఇక్కడ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు.

ఏఎంసీ కళాశాలలో అటానమీ పరిచయం



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేత

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏఎంసీ ఇంజనీరింగ్ కళాశాలలో అటానమీ పరిచయ ప్రత్యేక కార్యక్రమం శుక్రవారం జరిగింది. వీటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ బీఈ రంగస్వామి, ఏఎంసీ సంస్థల వైస్‌చైర్మన్ రాహుల్ కల్లూరి, డైరెక్టర్ డాక్టర్ మోహన్‌బాబు ముఖ్యులుగా పాల్గొన్నారు. రాహుల్ కల్లూరి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలల సాధనలను న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్‌తోపాటు ఎన్‌బీఏ గుర్తింపు, అటానమీ గుర్తింపును ప్రస్తావించారు. పరిశ్రమలకు అవసరమైన అకడమిక్ అనుభవాధారిత నైపుణ్యత, ఆవిష్కరణలకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇంటర్న్‌షిప్, పరిశోధనలు, ఉద్యమశీలతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రంగస్వామి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్, సర్ ఎం విశ్వేశ్వరయ్యల అనుభవాలను ప్రతి విద్యార్థి ప్రేరణ పొందాలన్నారు. వికసిత భారత్ నిర్మాణంలో విద్యార్థులు కీలక భూమిక పోషించాలన్నారు. అకడమిక్ సాధనలను ఇంక్యుబేషన్ కలాపాలను వివరించారు. కళాశాలలో అధ్యాపకులు, అకడమిక్ సలహాదారులు, డీన్‌లు, హెచ్ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫేజ్ షిఫ్ట్ టెక్నో సదస్సులో రాణించిన విద్యార్థులు



సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బీఎంఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫేజ్ షిఫ్ట్ 2025 పేరిట నిర్వహించిన అంతర్జాతీయ టెక్నో సదస్సులో విద్యార్థులు రాణించారు. అల్ట్రాడిజైన్ టెక్నాలజీస్ చైర్మన్ కల్నల్ హెచ్ఎస్ శంకర్, జోస్కేలర్ ఇంజనీరింగ్ సైట్ ఎండీ విశాల్ గౌతం, బయో ఎంజైమ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అకాడమీ ఆఫ్ ఇడియా చైర్మన్ ప్రీతిరావ్ ముఖ్యులుగా పాల్గొన్నారు. టెక్నాలజీ, సృజనశీలతకు అనుగుణంగా సదస్సు జరిగింది. బీఎంఎస్ ట్రస్టీ అభిరామ్ శర్మ అధ్యక్షతన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు నిరుపమానం



ఉపాధ్యాయులకు సన్మానం

ముళబాగిలు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భావిపౌరుల నిర్మాణంలో సమాజంలో ఉపాధ్యాయుల సేవలు నిరుపమానమని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ అభిప్రాయపడ్డారు. పట్టణ శివారులోని పూల్‌చంద్ కల్యాణ మండపంలో తాలూకాస్థాయి ఉపాధ్యాయుల దినోత్సవ సమితి, విద్యాశాఖ సహకారంతో ఏర్పాటైన ఉపాధ్యాయుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. భారతరత్న రాధాకృష్ణన్ ఆదర్శాలు నేటి టీచర్లకు అనుసరణీయమన్నారు. ఉపాధ్యాయులు తలచుకుంటే ఏమైనా సాధించవచ్చునన్నారు. ఇదే సందర్భంగా రిటైరైన ఉపాధ్యాయులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీ గీతా, ప్రగతి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు జోగుల కాష్ఠి మునేశ్, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎంఎస్ శ్రీనివాసరెడ్డి, తాలూకా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వెంకటగిరియప్ప, బీఈఓ రామచంద్ర, తాలూకా పంచాయతీ ఈఓ డాక్టర్ కే సర్వేశ్, కోముల్ డైరెక్టర్ బీవీ శామేగౌడ తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమపై జీఎస్టీ తొలగించాలి

» అనంత ఎంపీకి దేవాంగ సంఘం వినతి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న దేవాంగ సంఘం నాయకులు

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వస్త్ర పరిశ్రమపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు విన్నవించారు. కేంద్రపట్టుమండలి 76వ సంస్థాపన దినోత్సవంలో పాల్గొనేం దుకు వచ్చిన ఎంపీని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ దేవాంగసంఘం వెల్ఫేర్ కో-ఆర్డినేటర్ పాపణ్ణతోపాటు పలువురు భేటీ అయ్యారు. జీఎస్టీ రద్దు విష యమై ఎంపీ మాట్లాడుతూ పార్లమెంటులో చేనేతకార్మికుల సమస్యలను ప్రస్తావిస్తానని, జీఎస్టీ కౌన్సిల్‌కు లేఖ రాస్తానన్నారు. కార్మిక సంఘం నాయ కుడు చిన్నప్ప, చన్నకేశవులు, పురుషోత్తం, పృథ్వి, కృష్ణనాయక్ ఉన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11.351	10,687
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11,146	10,147
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

శ్మశానం లేక ఇబ్బందులు

కంప్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): హడగలి తాలుకాలోని మగల గ్రామంలో శ్మశాన వాటిక లేక పోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతూ మృతదేహాలను రోడ్డుపక్కన పూడ్చి పెడుతున్నారు. 20 సంవత్సరాలుగా శ్మశానవాటిక కోసం పోరాడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. అయితనా ఫలితం లేకుండా పోయిందని, దరఖాస్తులు అందజేస్తున్నా అధికారుల్లో చలనం లేకుండా పోయిందని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా నాయకులు స్పందించి శ్మశానానికి స్థలం కేటాయించాలని, సొమ్ము చెల్లించి భూమి కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.

ఇసుక అక్రమ తరలింపు..

ఒకరిపై కేసు నమోదు



తెప్పలతో ఇసుక తరలిస్తున్న దృశ్యం

కంప్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): హడగలి తాలుకాలోని కురువట్టి సమీపంలోని తుంగభద్ర నదిలో అక్రమంగా ఇసుకను తెప్పల ద్వారా రవాణా చేస్తున్న ఒక బృందంపై గనులు భూగర్భ శాస్త్ర శాఖ అధికారులు దాడి చేసి ఐదు తెప్పలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. నిర్దిష్ట సమాచారం ఆధారంగా గనులు భూగర్భ శాఖ అధికారి మల్లయ్య, పోలీసు సిబ్బంది స్థానికుల సహాయంతో దాడి చేసి ఐదు తెప్పలను స్వాధీనం చేసుకున్నారు. దాడి జరుగుతుండగా ఇసుక నింపే కార్మికులు తెప్పలను నదిలో వదిలి పారిపోయారు. శని వారం హిరే హడగలి పోలీసు స్టేషన్‌లో ఈ విషయంలో కేసు నమోదు చేయబడింది. నదిలో అక్రమంగా తీసుకున్న ఎవరు తరలించినా వారిపైన కేసులు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ఆ స్థలం ఖుద్రేముఖ్‌కే..



సండూరు ప్రాంతంలోని కుమారస్వామి ఫారెస్ట్

బళ్లారి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా సండూరు వద్ద ఉన్న కుమారస్వామి ఫారెస్ట్‌లో దేవదారి బ్లాక్‌లో అటవీ భూమిని ఖుద్రేముఖ్ కంపెనీకి (కేఐఓసీఎల్)వెయ్యి ఎకరాలు(470 హెక్టార్లు) ఇనుము ఖనిజ తవ్వకాల కోసం అప్పగించాలని హైకోర్టు అటవీశాఖను ఆదేశించింది. కోర్టు ఉత్తర్వులను కేఐఓసీఎల్ కంపెనీ ప్రతినిధులు జిల్లా ఫారెస్ట్ కన్జర్వేటర్ (డీసీఎఫ్)కు అందించారు. ఒప్పందం ప్రకారం గనులు తవ్వకాలకు ఆ అటవీ భూమిని ఇవ్వాలని తీర్పులో సూచించారు.

2021లోనే లీజులు

దేవదారి ఫారెస్టులో మైనింగ్ తవ్వకాలకు కేఐఓసీఎల్ కంపెనీ 2021లో స్టేజ్-1, 2022లో స్టేజ్-2 ప్రకారం 50 ఏళ్ల లీజ్ పొందింది. కేంద్ర గనుల శాఖ ఇక్కడ మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇచ్చారు. కానీ ఇక్కడ అట్టమైన అడవి ఉంది. చారిత్రాత్మక కుమారస్వామి దేవాలయం ఉంది. ఇందులో వేలాది వృక్షాలు ఉన్నాయి. ఇక్కడ తవ్వకాలకు అనుమతి ఇస్తే పర్యావరణం పూర్తిగా నాశనం అవుతుందని అటవీ శాఖ అప్పట్లోనే ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. అలాగే జనం కోసం పోరాడుతున్న జనసంగ్రహపరిషత్ పోరాట సంస్థ, ఇతర రైతులు గ్రామస్థులు ఉద్యమాలు చేశారు. దేవదారి ప్రాంతంలో కేఐఓసీఎల్‌కు మైనింగ్ తవ్వకాలకు అటవీభూమిని ఇవ్వరాదని పోరాడారు. కొందరు కోర్టును కూడా ఆశ్రమించారు. అయితే కేఐఓసీఎల్ హైకోర్టు నుంచి తాజాగా మైనింగ్ తవ్వకాలకు ఉత్తర్వులు పొందింది.

కుద్రేముఖ్ ఐరన్ ఓర్‌కంపెనీ ఎందుకు ఇక్కడ మైనింగ్ అవసరం అంటే-గతంలో పశ్చిమ కనుమల్లోని చిత్రదుర్గ జిల్లాలో ఖుద్రేముఖ్ అటవీప్రాంతంలో కంపెనీ స్థాపించారు. అక్కడ పర్యావరణాన్ని తవ్వకాలతో దెబ్బ తీశారు. అంతే కాకుండా మైనింగ్ తవ్వకాల వ్యర్థాలను అక్కడి జల్లాల్లో కలిపేవారు. కాలుష్యంపై ప్రజాపోరాట సంస్థలు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రమించాయి. అక్కడ ఖ్రేద్రేముఖ్ తవ్వకాలను ఆపేయాలని. ఇక్కడి నుండి పరిశ్రమలు లేకుండా ఇతర ప్రాంతాలకు వెల్లలని గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశించింది. పర్యావరణం దెబ్బ తీసినందుకు వేల కోట్ల రుసుం వసూలు చేసింది.

మంగళూరుకు ఐరన్ ఓర్ తరలించే యోచన

దేవదారి బ్లాక్ నుంచి మైనింగ్ తవ్వకాలు చేస్తే ఇక్కడ నుంచి మంగళూరుకు ఐరన్ ఓర్ తరలించేందుకు ఆకంపెనీ ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తుంది. కానీ ఇక్కడ జనసంగ్రమ పరిషత్, పర్యావరణ సంరక్షణ పోరాట సమితి కూడా హైకోర్టు ఉత్వర్వులను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ వేస్తామని తెలిపింది. సుప్రీం కోర్టు కూడా పెరిగిన వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు, అవసరం అయితే అనేక చోట్ల చెట్లు నాటాలని గతంలో సూచించింది. కానీ కేంద్ర గనుల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ప్రభుత్వం పరగంగా ఇక్కడ గనుల్లో తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం తప్పుపట్టింది.

ఎన్‌ఎండీసీ నుంచి అయితే ఓకే..

సండూరు ఫారెస్టు ఏరియాల్లో ఎన్‌ఎండీసీ కంపెనీ ఇనుప ఖనిజం తవ్వకాలు చేస్తుంది. ఎన్‌ఎండీసీకి రెండు మైనింగ్‌లు లీజ్ ఉన్నాయి. ఎన్‌ఎండీసీ తవ్వకాలు చేసిన ముడిఖనిజం ను కేఐఓసీఎల్ కూడా కొనుగోలు చేయవచ్చు. కానీ కేఐఓసీఎల్ ఇక్కడ మైనింగ్ కోరడం వెనుక వేరే అర్థం ఉందని కొందరు ప్రజాసంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి: రైతు సంఘం



జిల్లా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న, కందులు, వేరశనగ, సజ్జలు, సూర్యకాంతి తదితర సరుకులు కొనుగోలు చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా మద్దతు ధర కొనుగోలు కేంద్రాలు తెరవాలని కన్నడ నాడు రైతు సంఘం కోరింది. శనివారం వారు నగరంలోని జిల్లాధికారి కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర లేక ఇబ్బంది పడుతున్నారని, ఇప్పటికైనా సీఎం స్పందించి కొనుగోలు చేపట్టాలన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు మెనసిన ఈశ్వరప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో బహుతేక పంటలు మొక్కజొన్న, కందులు, సూర్యపాన, హైబ్రిడ్ జొన్నలు మార్కెట్‌కు చేరుతున్నాయని, ఇలాంటి సమయంలో అన్ని పంటల ధరలు ఘోరంగా పడిపోయాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మద్దతు ధర ప్రకటించాలని కోరారు. సజ్జ క్వింటాల్ రూ.2,775, మొక్కజొన్న రూ.2,400, సూర్యకాంతి రూ. 7721, వేరుశనగ రూ. 7,763, జొన్నలు రూ.3,700, కందులు రూ.8000 ధరతో కొనుగోలు చేయాలని కోరారు. ఈసందర్భంగా కన్నడ నాడు రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.22

అనంతపురం రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.22తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠ ధర రూ.14, సరాసరి ధర రూ.17తో విక్రయాలు జరిగాయన్నారు.

అనుమానాస్పద స్థితిలో తల్లీబిడ్డల మృతి

పావగడ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో తల్లి, తన ఇద్దరు బిడ్డలకు ఉరివేసి తాను కూడా ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన తాలూకా పరిధిలోని కడపలకెరె గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. సరిత(28) అదే గ్రామానికి చెందిన సంతోష్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల రిష్విక్ యాదవ్, రెండేళ్ల యుక్తి ఉన్నారు. కుటుంబ కలహాలతో తరచూ గొడవపడేవారని స్థానికులు తెలిపారు. శనివారం సాయంత్రం ఏం జరిగిందో కానీ ఎవరూ లేని సమయంలో తన ఇద్దరు పిల్లలకు ఉరివేసి తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త సంతోష్ తెలుపడంతో సరిత తల్లి శాంతమ్మ, తండ్రి ఓబిరెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. తన కుమార్తె అలాంటిదికాదని ఇది అనుమానాస్పద మృతి అని మృతికి కారణమైన వారిపై కేసు నమోదుచేసేంతవరకు మృతదేహాలను తాకనీయమని కుటుంబీకులు భీష్మించారు. ఘటనాస్థలానికి డీవైఎస్పీ మంజునాథ్ చేరుకుని సంఘటన వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన తరువాతే హంతకులెవరనేది, తేలుతుందని నచ్చచెప్పడంతో మృతదేహాలను పావగడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు వారు ఒప్పుకున్నారు.



తల్లీబిడ్డల మృతదేహాలు

అసమానత, అన్యాయాన్ని రూపుమాపాలి

● సమాజంలో మార్పే ఏఐడీఎస్ఓ లక్ష్యం ● కౌన్సిల్ అధ్యక్షుడు సౌరవ్ ఘోష్



మాట్లాడుతున్న సౌరవ్ ఘోష్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాధ, అసమానత, అన్యాయం వంటి సమస్యలను సమూలంగా రూపుమాపాలని, అప్పుడే నిజమైన మానువుడు రూపు దిద్దుకుం టారని, ఆలాంటి కొత్త మానవులను సృష్టించడమే ఏఐడీఎస్ఎస్ఓ లక్ష్యం అని సంఘం సెంట్రల్ కౌన్సిల్ అధ్యక్షుడు సౌరవ్ ఘోష్ అన్నారు. విద్య సంస్కృతి మానవత్వాన్ని కాపాడటం అనే నినాదంతో నగరంలోని బలిజా భవన్‌లో సంఘం కర్ణాటక రాష్ట్ర కమిటీ నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్మికుల అధ్యయన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కాపాడటానికి, చారిత్రాత్మక విజయవంతమైన పోరాటాన్ని నిర్మించడానికి 50లక్షల సంతకాలను సేకరించడం ద్వారా అనేక విద్యా సమస్యలపై పోరాడుతున్న సంస్థ కార్మికులందరినీ ఆయన అభినందించారు. చరిత్రలో సంస్థ లేకుండా మానవ నాగరికత అభివృద్ధి చెందలేదన్నారు. మానవ నాగరికత కుటుంబం, సమాజం, గ్రామాల ద్వారానే అభివృద్ధి చెందిందన్నారు. ఏఐడీఎస్ఎస్ఓ విద్యార్థి సంస్థ విద్యా సమస్యలకు వ్యతిరేకంగా పోరాడటమే కాకుండా సమాజంలో ప్రాథమిక మార్పు తీసుకురావడానికి కృషి చేస్తోందని, కార్మికులు పూర్తిగా సహకరించాలన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర కోశాధికారి సుభాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అపూర్వ అధ్యక్షత వహించారు. వేదికపై రాష్ట్ర అధ్యక్షురాలు అశ్విని, రాష్ట్ర కార్యదర్శి అజయ్ కామత్, అభయ దివాకర్, హనమంతు, చంద్రకళ, మహంతేరుశ్, వివిధ జిల్లాల వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని కేసులు

కూడేరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో శనివారం ఒకే రోజు రెండు అదనపు కట్నం వేధింపుల కేసులు నమోదయ్యాయి. కమ్మూరు గ్రామానికి చెందిన శైలజను అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధింస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. శైలజకు గార్లదిన్నె మండలం కనుంపల్లి గ్రామానికి చెందిన అనిల్ కుమార్‌తో ఆరు నెలల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో ఆరు తులాల బంగారం కట్నంగా ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదనపు కట్నం కావాలని నిత్యం వేధిస్తున్నారని శైలజ పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఆమె భర్త అనిల్ కుమార్, అత్త రమాదేవి, మామ జగన్నాథ్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఇదే తరహాలో చోళసముద్రం గ్రామానికి చెందిన వనిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె భర్త పురుషోత్తం, అత్త లక్ష్మీదేవి, మామ చిదంబరప్పపై పోలీసులు కేసు నమోదు చేశారు. వనితకు గార్లదిన్నె మండలం పెనకచెర్లకు చెంది పురుషోత్తంతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. పురుషోత్తం ఉద్యోగ రీత్యా ఢిల్లీలో ఉండటంతో అక్కడే కాపురం పెట్టారు. అదనపు కట్నం కావాలని తనను నిత్యం వేధిస్తున్నారని వనిత ఫిర్యాదు చేశారు.

అదృశ్యమైన తల్లీబిడ్డలు సేఫ్

● హైదరాబాద్‌లో గుర్తించి తీసుకొచ్చిన గుత్తి పోలీసులు

గుత్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి ఇద్దరు పిల్లలతో వెళ్లిపోయిన మహిళను హైదరాబాదులో గుత్తి పోలీసులు గుర్తించి, తిరిగి తీసుకువచ్చారు. పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన మాధవి తన పిల్లలు సిద్ధార్థ్, భానుశ్రీతో కలిసి జూలై 18న బాట సుంకులమ్మ ఆలయానికి వెళ్లారు. ఆ తరువాత ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు సుంకరత్నమ్మ, వెంకటరాముడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు, వారు హైదరాబాదులోని యూసఫ్ గూడలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి పోలీసు స్టేషన్‌లో రికార్డు చేయించి గుత్తికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తన భర్త శ్రీనివాసులు కార్పెంటరు పనికి వెళ్లడం లేదని, దీంతో పిల్లల పోషణ భారం కావడంతో అతనితో విభేదించి ఇంటి నుంచి వెళ్లి పోయానని మాధవి తెలిపారు.



హైదరాబాద్‌లో మాధవి, ఆమె పిల్లలతో గుత్తి పోలీసులు

హోసూరు జోన్



డీఎంకే పార్టీ కండువాలతో కార్యకర్తలు

డీఎంకేలోకి పలువురి చేరిక

హోసూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): హోసూరు మునిసిపాలిటీలో వేర్వేరు పార్టీల నుంచి విడిపోయినవారు డీఎంకేలో చేరారు. మేయర్ సత్య నేతృత్వంలో ఏర్పాటైన కార్యక్రమంలో వందమందికిపైగా కార్యకర్తలు చేరారు. పార్టీ కండువాలతో స్వాగతించారు. హోసూరు మునిసిపల్ కౌన్సిల్ ఛైర్మన్ సెందిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. కౌన్సిల్ సభ్యులు నాగరాజ్, వెంకటేశ్, జై ఆనంద్, ధనపాల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వేపనపల్లిలో ఉచిత వైద్య శిబిరం



శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వేపనపల్లి ప్రభుత్వ బాలికల హయ్యర్ సెకండరీ పాఠశాల ఆవరణలో శనివారం నాలం కాకం స్టాలిన్ ప్రాజెక్టు పేరిట మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిబిరంలో 1402 మంది పేర్లు నమోదు చేసుకుని ప్రయోజనాలు పొందారన్నారు. గ్రామీణ ప్రాంతాలు, మురికివాడలు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో మెరుగైన వైద్యం కోసం ఉచిత శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బీపీ, షుగర్, మానసిక ఆరోగ్య సమస్యలు, గుండె సమస్యలు, గర్భిణీలు, దివ్యాంగులు, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారన్నారు. శిబిరంలో ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్యబీమా పథకం అధికారి సెందిల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

హోసూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి హోసూరు మీదుగా కోయంబత్తూరుకు 8 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. జూజువాడి చెక్‌పోస్ట్ వద్ద సిప్‌కాట్ పోలీసులు వాహన తనిఖీలు చేశారు. ఓమ్ని వ్యాన్‌ను పరిశీలించగా గంజాయిని గుర్తించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన కాళిపాడ మండల్ (22), మదన్‌మండల్ (31)ను అరెస్టు చేశారు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో నిందితులు



పురాతన బావిని శుభ్రం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):ప్రధానమంత్రి మోదీ పుట్టినరోజు సందర్భంగా హవాంబావిలోని ఆంజనేయ ఆలయం సమీపంలో స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టింది. బీజేపీ నగర విభాగం యువ మోర్చా అక్టోబర్ 2వరకు చేపట్టిన స్వచ్ఛతా డ్రైవ్‌లో భాగంగా శనివారం బావిని శుభ్రం చేశారు. నగరంలోని హవంబావి ఆంజనేయ స్వామి ఆలయం పురాతన బావిలొ చెత్తను తొలగించి శుభ్రపరిచారు. ఈసందర్భంగా నగర మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి, సఫాయి కర్మచారి నిగమ్ మాజీ అధ్యక్షుడు హెచ్.హనుమంతప్ప,పార్టీ నాయకుడు డాక్టర్ మహిపాల్, నగర అధ్యక్షుడు వెంకటరమణ, మున్సిపాలిటీ బీజేపీ సభ్యులు , వివిధ మోర్చా ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

సహకార సంఘం లాభం రూ.10.24 లక్షలు



మాట్లాడుతున్న సహకార సంఘం అధ్యక్షుడు దుర్గప్ప

కంప్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముద్దాపురం అగసిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. అధ్యక్షులు కట్టే సన్న దుర్గప్ప, సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. ముఖ్య కార్యనిర్వాహక అధికారి హెచ్ ఈరన్న నివేదికను సమర్పించి మాట్లాడుతూ కంప్లి సొసైటీ 1976-77లో పునర్వ్యవస్థీకరించబడింది. 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి సొసైటీలో మొత్తం 3981 మంది సభ్యులు ఉన్నారు. సభ్యుల వాటా మూలధనం రూ.1,29,36,500 దీనికి ప్రభుత్వం నుంచి 2.20 లక్షల వాటాలు వున్నాయి. వివిధ ప్రాజెక్టులలో రుణాలు పంపిణీ చేయబడ్డాయి. రుణంలో 99 శాతం తిరిగి పొందబడ్డాయి. సొసైటీ రూ. 1,85,51,582 లక్షలు రుణేతర వ్యాపారాన్ని నిర్వహించింది. మొత్తం రూ. వ్యాపార లాభాల్లో రూ.14.27 లక్షలు ఆర్జించబడ్డాయి. అసోసియేషన్‌లో రూ. 2.57 లక్షలు డిపాజిట్ వుంది. యశస్విని బీమా ఆరోగ్య పథకం కింద 930 కుటుంబాలను నమోదు చేసుకున్నాము. 2024-25 సంవత్సరానికి అసోసియేషన్ రూ. 10,24,940 నికరలాభం ఆర్జించిందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు బాలే మల్లికార్జున, డైరెక్టర్లు అల్లి నాగరాజు, ఈరప్ప జోలమార, సన్నప్ప, ఎస్‌టీ నిరంజనయ్య, గంగన్న తల్వారా, రాజేష్ షెరెగర, కృష్ణ కేబీ, బసవరాజు, విశాలాక్షి, బీఎంకే నాగమ్మ, దేశనూరు మంజునాథ్, నాయకులు బి సిద్దప్ప, కారేకల్ మనోహర్, సిబ్బంది సభ్యులు హెచ్ ఈరన్న, కే ప్రకాష్, హెచ్ పరశురామ, ఎస్ మంజునాథ, భరత్, సిద్దేశ్, మంజునాథ్, పాణి సోమప్ప, నాయకులు సహ రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



పుష్పాలంకరణలో పేటె ఆంజనేయస్వామి

సిరుగుప్ప, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదీ నుంచి పేటే ఆంజనేయ స్వామి ఆలయంలో 27వ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్యామాచార్య తెలిపారు. శనివారం విలేఖరులతో ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు 11 రోజుల పాటు శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం స్వాముల వారికి మహా పంచామృతాభిషేకం, పుష్పార్చన, నైవేద్యం మహామంగళ హారతి, రాత్రి ప్రత్యేక అలంకార సేవలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం గంధ ఆంజనేయస్వామి అలంకరణ, 23న మంగళవారం ముత్యాల ఆంజనేయ అలంకారం, 24వ తేదీ సర్వ అభయాంజనేయ అలంకరణ, 25వ తేదీ ద్విగళ ఆంజనేయ అలంకరణ, 26 శాక ఆంజనేయ, 27 సింధూర ఆంజనేయ, 28వ తేదీ జాంబవంత ఆంజనేయ, 29వ తేదీ రుద్రాంజనేయ, 30వ తేదీ యంత్రాంజనేయ, అక్టోబరు 1వ తేదీ ఫలాంజనేయ అలంకరణ, అక్టోబరు 2 విజయదశమి రోజుల పుష్పాంజనేయ అలంకరణ చేస్తున్నట్లు అర్చకులు తెలిపారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బీఐటీఎంలో 11మందికి బీఈ ఆనర్స్ డిగ్రీలు



ఆనర్స్ డిగ్రీ అందుకుంటున్న విద్యార్థిని ఆలియా సామా

బళ్లారి సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో 2024-25 సంవత్సరానికి చెందిన 11మంది విద్యార్థులు బీఈఓ లో ఆనర్స్ డిగ్రీతో పట్టభద్రులయ్యారు. తమ కళాశాల స్వయంప్రతిపత్తి పొందిన తర్వాత వీరు మొదటి బ్యాచ్ విద్యార్థులు అని కళాశాల వైస్‌చాన్సలర్ పృథ్వీరాజ్ అన్నారు. శనివారం తన బిజినెస్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంజనీరింగ్‌లో డిగ్రీ పొందడానికి మీరు సాధారణంగా 160 క్రెడిట్‌లను పొందాలని, ఆనర్స్ డిగ్రీ పొందాలనుకునే వారు ఐదవ సెమిస్టర్ నుంచి అదనంగా 18క్రెడిట్‌లను పొందాలన్నారు. అంటే వారు అదనపు సబ్జెక్టులను చదివి పరీక్ష రాయాలి. ఇలా ప్రాక్టీస్ చేయడానికి కళాశాల నుంచి 18మంది పరీక్ష రాశారు. వారిలో 11మంది ఆనర్స్ డిగ్రీ పొందడంలో విజయం సాధించారన్నారు. వారిలో ఆలయాసామా 73క్రెడిట్‌లను పొందడం ద్వారా జాతీయ రికార్డును సృష్టించింది. ఈ సందర్భంగా ఆమెను సత్కరించినట్లు తెలిపారు. మెదటి ర్యాంక్ విద్యార్థి అయిన అలియా సామా 73 క్రెడిట్‌లను పొందడం ద్వారా జాతీయ రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. ఆమెకు బసవరాజేశ్వరీ మెమోరియల్ గోల్డ్ మెడల్ లభించింది. ఆలియా ఇప్పుడు జర్మనీలోని సిమెన్స్ కంపెనీలో ఉద్యోగి. ఈ సంవత్సరం తన కళాశాలలో చదివిన 581 మందికి వివిధ కంపెనీల నుంచి ఉద్యోగ ఆఫర్లు వచ్చాయని, వారికి రూ.40 లక్షల వరకు ప్యాకేజీలు వచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. మా కళాశాల వివిధ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుందని, విద్యా సమయంలో నైపుణ్యాభివృద్ధిని అందిస్తోందన్నారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ యడవల్లి బసవరాజ్, ఎలక్ట్రికల్ , ఎలక్ట్రానిక్స్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శరణ్‌రెడ్డి, ఆలియా తండ్రి షకీబ్ హాజరయ్యారు.

ప్రాణం తీసిన టిప్పర్

రాప్తాడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొందిరెడ్డిపల్లి వద్ద టిప్పర్ కింద పడి శ్రీకాంత్(28) అనే యువ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు, రామినేపల్లికి చెందిన శ్రీకాంత్ కనగానపల్లి వద్ద రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని టమోటా సాగు చేశాడు. టమోటా పంటకు పురుగుల మందు పిచికారీ చేసి, బైక్‌పై తిరిగి వస్తుండగా గొందిరెడ్డిపల్లి వద్ద టిప్పర్ ఎదురుగా వచ్చింది. దీంతో బైక్‌ను శ్రీకాంత్ రోడ్డు పక్కకు తీసి ఆగాడు. టిప్పర్ ముందు భాగం వెళ్లిన తరువాత వెనుక భాగం బైక్ హ్యాండిల్‌కు తగులుకుంది. దీంతో శ్రీకాంత్ అదుపు తప్పి టిప్పర్ చక్రాల కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్ కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరకుని బోరున విలపించారు. శ్రీకాంత్ మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.